క్లుప్తంగా

ఓంకారేశ్వరుని సన్నిధిలో కలెక్టర్



బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకార క్షేత్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాజకుమారి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, అర్చకులు కలెక్టర్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ధోనీఆల్‌ఫ్రెడ్, వీఆర్‌ఓ కలాం, పూజారి మల్లికార్జున ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయశేఖర్

నందికొట్కూరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వ్యవసాయ డివిజన్ అధికారి విజయశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల ఉద్యోగులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద రైతులు అడిగిన వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి పబ్లిక్ అథారిటీ పనిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కేశవ

కొత్తపల్లి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా చదువుకోవాలని ఎస్‌ఐ కేశవ సూచించారు. గురువారం మండల పరిధిలోని గోకవరం, శివపురం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువతులపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలు ఏదైనా ఆపద సమయంలో 100, 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని తక్షణమే పొందవచ్చునన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, విజయలక్ష్మమ్మ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధి అంటు వ్యాధి కాదన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ చెంచన్న, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్స్ సరిత, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వర్కర్లు రజియా, సంతోషమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి

మహానంది: విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. ఎం.తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆయన ఎంఈఓ రామసుబ్బయ్యతో కలిసి తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకోండి

వెలుగోడు: స్పెషల్ ఆధార్ క్యాంపులో ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిదిద్దుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. నాలుగో సచివాలయంలో జరుగుతున్న ఆధార్ సెంటర్‌ను పరిశీలించి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ప్రక్రియను, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

స్వయం ఉపాధిపై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వయం ఉపాధిపై హెచ్‌ఎం వెంకటరమణ అవగాహన కల్పించారు. గురువారం 9, 10వ తరగతి విద్యార్థులను పట్టణంలోని షన్విత కంప్యూటర్ ఎంబ్రాయిడరీ సెంటర్‌కు తీసుకెళ్లి కంప్యూటర్ ఎంబ్రాయిడరీలోని మెలకువలు, మగ్గం వర్క్‌పై అవగాహన కల్పించారు.

శుద్ధ అబద్ధం

సున్నిపెంట వాసులకు శుద్ధ జలం అందడం లేదు. గ్యాస్ అయిపోవడం, మెటల్, సాండ్ మార్చకపోవడంతో నీరు శుద్ధి కావడం లేదు. అదే నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజలు టైఫాయిడ్, మలేరియా లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారు. మరోవైపు తగినంత సిబ్బంది లేకపోవడం, మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేయకపోవంతో నెలల తరబడి ట్యాంక్‌లు శుభ్రం చేయక పాచి పట్టి కంపు కొడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

- శుద్ధి చేయకుండానే కుళాయిలకు నీటి సరఫరా
- అదే నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్న సున్నిపెంటవాసులు
- పట్టించుకోని అధికారులు



విషజ్వరాల బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సున్నిపెంట వాసులు(ఫైల్)

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట, లింగాల గట్టు గ్రామాల వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో మురుగునీటినే తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఫిల్టర్‌హౌస్ ఉన్నప్పటికీ నిర్వహణను అధికారులు గాలికొదలడంతో ప్రజలకు గరళ జలమే దిక్కవుతోంది. ఈ నీటిని తాగి రెండు నెలల క్రితం పలువురు విష జ్వరాల బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. అయినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఇప్పటికీ అవే నీటిని జలవనరులశాఖ అధికారులు యథావిధిగా సరఫరా చేస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దిష్టిబొమ్మల్లా ఫిల్టర్లు



పనిచేయని ఫిల్టర్లు

2018లో రూ.2.61 కోట్ల ఎన్‌ఆర్‌డీఎన్‌పీ నిధులతో సున్నిపెంట ఫిల్టర్ హౌస్ ప్రాంగణంలో క్లోరినేషన్, ఫిల్టరేషన్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వాటి నిర్వహణను అధికారుల పట్టించుకోవడమే మానేశారు. మరోవైపు క్లోరినేషన్ గ్యాస్ అయిపోవడం, చెన్నై మెటల్, సాండ్‌ను మార్చకపోవడంతో నీరు శుద్ధి కావడం లేదు. అదే నీటిని నీటినే సున్నిపెంట వాసులకు సరఫరా చేస్తున్నారు. రోజుకు సున్నిపెంట కాలనీ వాసులకు 70 లక్షల లీటర్ల నీరు అవసరమై ఉండగా, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖకు చెంది రెండు లైన్లు ఉన్నప్పటికీ రోజుకు 20 లక్షల లీటర్ల నీటిని కూడా సరఫరా చేయలేకపోతున్నారు. 2020లో జలజీవన్‌మిషన్ కింద సుమారు రూ.7.5 కోట్లతో గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణం, నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం శూన్యం. నీటిసరఫరా విభాగంలో సుమారు 30 మంది సిబ్బంది వివిధ షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉండగా చాలామంది పదవీవిరమణ చెందడంతో ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. వారికి కూడా సరిగా జీతాలు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో పంపింగ్, సరఫరా, మరమ్మతులలో జాప్యం, నిధులలేమితో నీటిని ప్రజలకు సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారు. ఫలితంగా కలుషితనీటిని తాగుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ఇంతవరకు జీతాలు లేవు



సున్నిపెంట నీటిసరఫరా విభాగంలో 2019 నుంచి తాత్కాలికంగా నలుగురం పని చేస్తున్నాం. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని మా జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదు. ఏదో ఒక ఉపాధి ఉందని పని చేస్తున్నాం. ఎపుడో ఒకప్పుడు మాకు ఇక్కడ ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో పని చేస్తున్నాం. ఇలాగే కొనసాగితే మేమందరం మానుకోవాల్సి వస్తుంది.

– మల్లికార్జున, లైన్‌మెన్

కంపు కొడుతున్న నీటి ట్యాంక్‌లు



ట్యాంక్‌లో నిల్వ చేసిన నీటిలో పేరుకుపోయిన పాచి

సున్నిపెంట ఫిల్టర్‌హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్‌ల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి కంపు కొడుతున్నాయి. నీటినిల్వ ట్యాంకుల చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లపై వేలాది గబ్బిలాలు నివశిస్తూ నీటిలో మల, మూత్రాలను వదులుతున్నాయి. ట్యాంకులను నిర్మించిన మాసంలో శుభ్రత చేయడానికి అవసరమైన నిధుల కేటాయింపు లేకపోవడంతో నాచు, పాచి పేరుకుపోయింది. ట్యాంకుల వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. ఫిల్టర్లు పని చేయకపోవడంతో అదే నీటిని తాగి రెండునెలల క్రితం వందలాదిమంది టైఫాయిడ్, మలేరియా తదితర విష జ్వరాల బారిన పడ్డారు.

పని భారం ఎక్కువైంది



డిస్ట్రిబ్యూషన్ విభాగంలో నలుగురు తాత్కాలిక సిబ్బందితోపాటు మరో ఇద్దరం ఉద్యోగులు ఉన్నాం. మూడుషిఫ్టుల్లో 365 రోజులు ఎలా పని చేయడం కష్టంగా ఉంది. సుమారు 30 వేల జనాభా ఉన్న సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాలకు నీటిని సరఫరా చేయాలంటే అంత సులభం కాదు. పైపులు చెడిపోయినా మేమే బాగు చేసుకోవాలి. ప్రతిలైనుకు నీటిని సరఫరా చేయాలి. ఫిల్టర్‌హౌస్‌లో రాత్రి, పగలు కాపలా ఉండాలి. ట్యాంకులు శుభ్రం చేయాలి. మొత్తానికి సిబ్బంది లేక పని భారం ఎక్కువైంది.

– ఓడీ రహంతుల్లా, లైన్‌మెన్

సిబ్బంది, నిధుల కొరత ఉంది



నీటి సరఫరా విభాగంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు అవసరమైనంత నీటిని రోజూ సరఫరా చేయలేకపోతున్నాం. మెయింటనెన్స్‌కు నిధులు ప్రభుత్వం కేటాయించకపోవడంతో ట్యాంకుల శుభ్రత, ఫిల్టర్, క్లోరినేషన్ జరగడంలేదు. పైపులైన్లు మరమ్మతులకు గురయితే ఖర్చుపెట్టేందుకు నిధులు లేవు. అవసరానికి అనుగుణంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించి, నిధులు కేటాయిస్తే నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సీహెచ్ చిట్టిబాబు, ఏఈఈ, జలవనరులశాఖ

అధిక రుసుము వసూలు చేయవద్దు



ఆధార్‌సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ గోపికృష్ణ

జూపాడుబంగ్లా: ఆధార్‌కేంద్రాల్లో నిర్ణీత రుసుముకంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ గోపీకృష్ణ హెచ్చరించారు. గురువారం జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది విద్యార్థులకు ఆధార్‌సేవలు అందిస్తున్నారని డిజిటల్ అసిస్టెంటు రాముడును అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌సేవలను వేగవంతం చేసి రోజుకు కనీసం 50మంది విద్యార్థులకు ఆధార్‌సేవలు అందించేలా చేయాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వంట నిర్వాహకులు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టాలని ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. గురువారం ఆయన జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వండిపెట్టిన ఆహార పదార్థాలు, ఉడకబెట్టిన గుడ్ల నాణ్యతను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

కోరం లేకపోయినా తీర్మానాలు



మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కోరం లేకపోయినా ఎమ్మెల్యే జయసూర్య కేవలం తనకు నచ్చిన వార్డులకు సంబంధించిన అంశాలపై మాత్రమే తీర్మానం చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై, నీటి సమస్యపై ప్రజాప్రతినిధులు చర్చించారు. అయితే పలు వార్డులకు సంబంధించిన 33 అంశాలను తీర్మానించేందుకు 29 మంది కౌన్సిలర్లకు గాను 14 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. కాగా, కోరం లేకపోయినా అంశాలను ఆమోదించాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ బేబిని ఆదేశించారు. కోరం లేకపోయిన ఇష్టమున్న వార్డులకే నిధులు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రబ్బాని, ప్రశాంతి, కౌన్సిలర్లు, మెప్మా శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమిపూజ

మిడుతూరు: మండలకేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రం నుంచి 1.4 కిలోమీటర్ల ఉన్న సింగిల్ రోడ్డును, రెండు లైన్ల రహదారిగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ డీఈ గోవర్ధన్ మాట్లాడుతూ నందికొట్కూరు నుంచి నంద్యాలకు వెళ్లే రహదారిలో గడివేముల మండలం బూజనూరు గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పనులను రూ. 9.70 కోట్ల నాబార్డ్ నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, ఆర్‌అండ్‌బీ ఏఈ మనోధర్, ఈఓఆర్డీ సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గింపు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి అధికారులు నీటి సరఫరాను గురువారం భారీగా తగ్గించారు. దిగువన ఉన్న రిజర్వాయర్లు గరిష్ట స్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కేవలం 2వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే ఎస్సార్బీసీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేస్తున్న నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ వద్ద నుంచి గాలేరు నగరి సుజలస్రవంతి(జీఎన్‌ఎస్‌ఎస్)కాల్వకు, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

నందికొట్కూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని ఆ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, మహమ్మద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు గ్రామీణ బ్యాంక్‌లు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడడంతో కడపలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలన్నారు. ఏపీజీబీ బ్యాంక్ అన్ని బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దదని, సొంత భవనం ఉందని, దక్షిణ భారత దేశంలోనే ఏ గ్రామీణ బ్యాంకుకు లేనటువంటి కరెన్సీ చెస్ట్ సౌకర్యం కలిగి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఉద్యోగులు సురేష్, రియాజ్‌బాషా, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మారెన్న

శ్రీశైలంటెంపుల్: విద్యార్థులపై వారి తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సున్నిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మారెన్న సూచించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ప్రిన్సిపాల్ మారెన్న మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కే సూర్యనారాయణ, డాక్టర్ వి అబూబకర్ పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి కిరీటం విరాళం



కిరీటం అందిస్తున్న దాతలు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి ఉయ్యాలవాడకు చెందిన భరత్‌కుమార్‌రెడ్డి, అనిత దంపతులు రూ.2.25 లక్షల విలువైన బంగారు పూతతో చేసిన వెండి కిరీటాన్ని విరాళమిచ్చారు. గురువారం వారు మహానందికి చేరుకుని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో కిరీటం అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

పగిద్యాల: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని జెడ్పీటీసీ సభ్యులు పుల్యాల దివ్య అన్నారు. గురువారం జెడ్పీటీసీ స్వగృహంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి పూలే 135వ వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, నాయకులు భాస్కరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, నాగేనారెడ్డి, సీతారామిరెడ్డి, రాఘవరెడ్డి, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- **నందికొట్కూరు:** పట్టణంలోని కేజీ రోడ్డుపై ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, రమేష్ నాయుడు బీసీ సంక్షేమ సంఘం నాయకులు కురుమూర్తి, కుల సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగలి కృష్ణ, నాయబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, ఉపేంద్రారెడ్డి, కిరణ్‌రెడ్డి, లడ్డు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గౌరీశ్వరనాయుడు, సీపీఐ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.
- **పాములపాడు:** మండల కేంద్రంలోని పూలే విగ్రహానికి బీసీ సంఘం జిల్లా నాయకుడు ఆర్‌ఎస్ఆర్ గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఐక్యసంఘం మండల అధ్యక్షుడు శంకర్‌గౌడు, రామ్మోహన్, సురేష్, శంకర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** మండల కేంద్రంలోని సంతగేటు ఆవరణలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్, సర్పంచ్ నాగార్జున రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకలకృష్ణారెడ్డి, యూత్‌నాయకుడు తరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సహకార సొసైటీ మాజీ చైర్మన్ వెంకటరమణ, దినేష్, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, అంబేడ్కర్ యువజన నాయకుడు ఆర్‌ఎంపీ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు మరువలేనివి



నందికొట్కూరులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ, కుల సంఘాల నాయకులు



ఆత్మకూరులో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

- **ఆత్మకూరు:** మహాత్మా జ్యోతిరావుపూలే సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బాలస్వామియాదవ్ అన్నారు. స్థానిక సంగమేశ్వర సర్కిల్‌లో పూలే వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే బడుగు, బలహీనవర్గాల కోసం చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, వీరన్న, నాగన్న, రఘురాముడు, వెంకటరమణగౌడ్, గోకుల తిమ్మయ్య, నారాయణయాదవ్, పెద్దనాగన్న, పెద్దన్న, నాగేష్ యాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.
- **శ్రీశైలంటెంపుల్:** సున్నిపెంట బస్టాండ్ సెంటర్‌లో పూలే చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎఎస్ ఇస్మాయిల్, నాయకులు చిన్నయ్య, ఖాజా హుసేన్, మహబూబ్‌బాషా, బాలన్న, ప్రసాద్, వెంకటయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **వెలుగోడు:** పూలే వర్ధంతి సందర్భంగా గురువారం వేంపెంట సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సారా స్వాధీనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం టోల్‌గేట్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు ప్రకాశం జిల్లా చిన్న దోర్నాల మండలం చిన్న గుడిపాడుకు చెందిన కుడుముల పొలమ్మ నాటు సారాతో పట్టుబడింది. ఆమెను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ పట్టణ సీఐ జి.ప్రసాద్‌రావు తెలిపారు. తనిఖీలో ఏఎస్‌ఐ సోమశేఖర్, పోలీసులు రఘునాథుడు, శివ మహేంద్రరెడ్డి, బాలకష్ణ, నాగవేణి పాల్గొన్నారు.

- **మహానంది:** బొల్లవరం గ్రామంలోని బెల్ట్‌షాపులో పోలీసులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పి.శ్రీనివాసులు నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుల మరణానికి కారణం కావద్దు

వెలుగోడు: శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను రోజుల తరబడి కుటుంబానికి దూరంగా ఉంచి వారి మరణానికి కారణం కావద్దని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సహకోశాధికారి కృష్ణార్జున రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక యాప్‌ల నిర్వహణ, బోధనేతర పనులతో టీచర్లు అత్యధిక పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో స్కూల్ లీడర్‌షిప్ ట్రెనింగ్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పేరుతో రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను సుదూర ప్రాంతాల్లో నిర్వహించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. అవసరమైతే ఆల్‌లైన్ ట్రెనింగ్ లేదా డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. మృతిచెందిన ప్రధానోపాధ్యాయులు రత్నకుమార్, శ్రీనివాసరావు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బ నాయక్, ఓ.వెంకటరమణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

- ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్



ఆత్మకూరు: మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ.1.39 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించి త్వరలో రింగు రోడ్డును ఏర్పాటు చేస్తామన్నారు. కేజీ రోడ్డు నుంచి తిక్కయ్యస్వామి దర్గా వరకు రూ.1.20 కోట్లతో పనులను ప్రారంభిస్తామన్నారు. ఇవి తొలి విడత నిధులతోనే పనులు పూర్తి చేస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. నీటి సమస్య లేకుండా కొత్తగా బోర్లు ఏర్పాటుకు రూ.19 లక్షలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతుకు రూ.2 లక్షలు కేటాయించామన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 10 అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, మేనేజర్ నాగబ్రహ్మం, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు సుగుణమ్మ, పార్వతి, లక్ష్మమ్మ, ఖైరున్‌బీ, గౌస్‌లాజం, మారుబోతుల విజయ్, రంగస్వామి పాల్గొన్నారు.

వివాహిత మృతిపై బంధువుల ఆందోళన



ఇరువర్గాలకు నచ్చజెపుతున్న పెద్దలు

మహానంది: ఓ వివాహిత మృతిపై ఆమె బంధువులు ఆరోపణలు చేయడంతో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తమ్మడపల్లె గ్రామానికి చెందిన వెంకటకృష్ణ ఆర్మీలో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం నంద్యాలకు చెందిన అనూష(22)తో వివాహమైంది. వీరికి 11 నెలల కుమారుడు ఉన్నారు. వీరు వారణాసిలో నివసిస్తుండగా అనూష ఇటీవల మూడు రోజుల క్రితం మృతి చెందడంతో అక్కడే పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భర్త వెంకటకృష్ణ ఇంటికి తీసుకొచ్చారు. అనూష బంధువులు గ్రామానికి చేరుకుని ఆమె మృతిపై ఆందోళన వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు. చివరికి పోలీసులు, పెద్దలు సర్దిచెప్పడంతో శాంతించారు.

నందీశ్వరుడికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలోని నందీశ్వరస్వామికి గురువారం త్రయోదశి సందర్భంగా 53 మంది భక్తులు పరోక్షసేవగా విశేష పూజలనను జరిపించుకున్నారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ, అనంతరం నందీశ్వరస్వామికి పంచామృతాలు, ఫలోదకాలతోనూ హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలున్న విద్యార్థులకు ఆప్తాల్మిక్ షేక్షావలి వైద్య సేవలు అందించారు. కంటి జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ బి.పద్మావతిబాయి పాల్గొన్నారు.